క్లుప్తంగా

గ్రామాల్లో చురుగ్గా అభివృద్ధి పనులు



డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. తోటాడ శివారు గవర్ల అనకాపల్లి రామాలయం నుంచి జంక్షన్ వరకు రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోటాడ పంచాయతీ ఆదర్శవంతంగా తయారు కావాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, మళ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నిక ప్రక్రియలో పాల్గొనండి

కోటవురట్ల: కో ఆప్షన్ మెంబర్ ఎన్నికను పారదర్శకంగా నిర్వహించనున్నట్టు మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో ఖాళీగా ఉన్న కో ఆప్షన్ మెంబర్ ఎన్నిక కోసం సోమవారం సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి మూడో తేదీన కో ఆప్షన్ మెంబర్ ఎన్నికను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అదే రోజున నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఎన్నిక ప్రక్రియ ఉంటాయని తెలిపారు. ఈ ఎన్నికలలో ఎంపీటీసీ సభ్యులందరూ హాజరు కావాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

స్వయంభూ శివునికి ప్రత్యేక పూజలు

అచ్యుతాపురం(అనకాపల్లి): పూడిమడక శివారు కొండపాలెంలో వెలసిన స్వయంభూ శివునికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామునుంచే భక్తులు దర్శించుకొని స్వామి వారికి పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు.

రేపటి నుంచి వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు



పూడిమడకలోని జగన్నాథస్వామి ఆలయం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో వెలసిన జగన్నాథ స్వామి ఆలయంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు. ఒకటో తేదీ సాయంత్రం 5 గంటలకు స్వామి వారి పల్లకీ సేవ, అదే రోజు రాత్రి 7 గంటలకు స్వామి వారి కల్యాణం ప్రారంభం అవుతాయని తెలిపారు. 4వ తేదీన స్వామి వారి జాగరణ, 5వ తేదీన పౌర్ణమి సముద్ర స్నానాలు, స్వామి వారి దర్శనం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 6న స్వామి వారి శ్రీ పుష్పయాగం, అద్దపు సేవ నిర్వహించనున్నారు.

శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన



కుమ్మరాపల్లిలో ఎరువులు వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రాంబిల్లి: మండలంలో రజాల, కుమ్మరాపల్లి, కట్టుబోలు గ్రామాల్లో పలువురు శాస్త్రవేత్తలు పర్యటించారు. హరిపురం బీసీటీ కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శైలజ, బండి నాగేంద్ర ప్రసాద్, కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శిరీష రబీ వరి నాట్లు పరిశీలించారు. ఎరువులు వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగించరాదని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కట్టుబోలు వీఏఏ ప్రశాంతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

మూడేళ్లలోనే ముప్పై ఏళ్ల అభివృద్ధి

- జగనన్నది చేతల ప్రభుత్వం
- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వెదుళ్లపాలెంలో నాడునేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



నక్కపల్లిలో బాలికల వసతి గృహ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నక్కపల్లి : అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో చరిత్ర పుటల్లో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. సోమవారం ఆయన మండలంలో ఉపమాక, నక్కపల్లి, వెదుళ్లపాలెం గ్రామాల్లో సుమారు రూ.4 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమాలు చేశారు. నక్కపల్లిలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించే బాలికల వసతి గృహానికి, ఉపమాకలో సుమారు రూ.1.50 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పథకంలో నిర్మించే ఇంటింటికీ కుళాయిల పథకానికి, వెదుళ్లపాలెంలో రూ.36 లక్షలతో నాడు నేడు పథకంలో పాఠశాల భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడేళ్లలో ముప్పై ఏళ్ల అభివృద్ధి చేసి చూపించామన్నారు. నక్కపల్లి మండలంలోనే సుమారు రూ.32 కోట్ల వ్యయంతో మొదటివిడతలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. రూ.40 కోట్ల వ్యయంతో జల్‌జీవన్‌మిషన్ కింద 31 పంచాయతీల్లో ఇంటింటికి తాగునీటి కుళాయిలు కార్యక్రమం చేపట్టామన్నారు. బాలికల ఉన్నత చదువుల కోసం రూ.2.50 కోట్ల వ్యయంతో వసతి గృహం మంజూరు, గ్రామీణ రహదారుల నిర్మాణం కోసం రూ.16 కోట్లు కేటాయింపు చేశామన్నారు. ఇవన్నీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే జరిగాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతోపాటు, నవరత్నాల్లో ప్రకటించిన హామీలన్నింటిని తమ ప్రభుత్వం 90 శాతం నెరవేర్చిందన్నారు. అందువల్ల ప్రజలను ఓటు అడిగే హక్కు తమకే ఉందన్నారు. ప్రజలు జగనన్న ప్రభుత్వ మళ్లీ రావాలని కోరుకుంటున్నారన్నారు. పారదర్శకంగా దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులు ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, సర్పంచ్‌లు రత్నకుమారి, వరలక్ష్మి, ఎంపీటీసీలు పార్వతి, దేముళ్లు, చంద్రరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, మాజీ సర్పంచ్ పాపారావు, మాజీ ఎంపీటీసీ హరిబాబు, సింహాచలం బోర్డు సభ్యురాలు శేషారత్నం, పార్టీ నాయకులు వెదుళ్ల రమణ, నర్సింహమూర్తి, బుజ్జి, గోవిందు, కొప్పిశెట్టి రమణ, బాబూరావు, ఎంఈవో ప్రసాద్, హెచ్‌ఎం పుష్పరాగం పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కన్నబాబురాజు



పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : అవినీతి రహిత పరిపాలనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. సోమవారం ఆయన యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో కొత్తపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నారని, రాష్ట్రంలో పేద ధనిక, కుల, మత భేదాలు ఏమీ లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వలంటీరు, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదేనని అన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తిరుగుతూ జగనన్న పరిపాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తూ అర్హత ఉండీ ఇంకా ఏమైనా పథకాలు అందని కుటుంబాలకు తక్షణమే వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా కొత్తపాలెం గ్రామంలో ఒక నిరుపేద కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలుపగా.. తక్షణమే 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవిందు, మాజీ ఎంపీపీ యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరరావు, అర్రెపు గుప్త, కౌన్సిలర్లు గొర్లె వెంకట్, దూది నర్సింహమూర్తి, త్రినాథ్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డేడ జన్మదిన వేడుకలు



బొడ్డేడ ప్రసాద్‌కు కేక్ తినిపిస్తున్న మంత్రి అమర్‌నాథ్, సుకుమారవర్మ, చిక్కాల రామారావు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకొని ప్రసాద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రొంగలి జగన్నాథం తదితరులు ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రసాద్‌తో కేక్ కట్ చేయించి కేక్ తినిపించారు. అనంతరం ప్రసాద్‌ను శాలువాలతో సత్కరించారు. ప్రసాద్ తన సొంత నిధులతో మునగపాకలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. మునగపాకలోని దళితవాడలో సర్పంచ్ దిమ్మల అప్పారావు అధ్యక్షతన పేదలకు దుప్పట్లు పంపిణీ నిర్వహించారు. బొడ్డేడ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 45 మంది దాతలు రక్తదానం చేశారు. ఎంపీపీలు, నాయకులు జయలక్ష్మి, సూరిబాబు, బోదెపు గోవింద, కోన బుజ్జి, జెడ్పీటీసీ శ్రీధర్‌రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిశోర్ పాల్గొన్నారు.

రాంబిల్లి: అప్పారాయుడుపాలెంలో సోమవారం ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజుకోడూరు సర్పంచ్ ముత్తా శంకర్రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పులూరి నాయుడు, నగిరెడ్డి వెంకటరమణ, సిరిదల్ల శ్రీను, కరణం చిరంజీవి, ఎం. వీరబాబు, వై.చక్రవర్తి తదితరులు కేక్ కట్ చేశారు.

గాంధీజీ ఆశయ సాధనకు పాటుపడాలి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు



చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో...



దిమిలిలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ వెంకటేష్

మునగపాక : ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయ సాధనకు పాటుపడాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, పల్లపు ఆనందపురం సర్పంచ్ కర్రి అప్పయ్యమ్మ సత్యనారాయణ, ఎంపీటీసీ కర్రి నాని, మండల పరిషత్ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాపూజీకి ఘన నివాళి

నక్కపల్లి : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం నక్కపల్లిలో నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ఎంపీపీ ఏనుగుపల్లిరత్నం, వైస్‌ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్డీ వెంకటనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ జనార్దన్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాంబిల్లి: గాంధీజీ ఆశయసాధనకు అందరూ ఆయన బాటలో పయనించాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్. వెంకటేష్ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా దిమిలిలో సోమవారం సర్పంచ్ బంగారు చిలుకుతో కలిపి ఆయన గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఘన సన్మానం



సీతారామరాజును సన్మానిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల ఉమ్మడి విశాఖ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయిన నక్కపల్లి ఎంపీడీవో డి.సీతారామరాజును సోమవారం పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్, ఈవో పీఆర్డీ వెంకటనారాయణ, పలువురు కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఎంపీటీసీలు, ఎన్‌ఆర్ ఈజీఎస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని సీతారామరాజు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలకు, పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తానన్నారు.

రేపటి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ 98వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ సోమవారం తెలిపారు. 1న ధ్వజారోహణ, బలిహరణం, సాయంత్రం నాగేశ్వరస్వామి, జనార్దన స్వామివార్ల మహోత్సవం, చిన్నవీధి రామాలయం వద్ద ఎదురు సన్మాన కార్యక్రమం, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, రాత్రి ఆలయ మండలంలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తామన్నారు. 2న సాయంత్రం సదస్యం, నాగవల్లీ పండితుల సత్కారం, 3న శ్రీవార్ల పుష్పాంజలిసేవ కార్యక్రమాలతో వేడుకలు ముగుస్తాయన్నారు.

'ధాన్యం కొనుగోలులో నిర్లిప్తత తగదు'



దాన్యం కొనుగోలుపై వివరణ ఇస్తున్న ఏవో అరుణకుమారి

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అనేక చర్యలు చేపడుతోందని, ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లిప్త ధోరణిలో ఉండడం బాధాకరమని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి అన్నారు. స్థానిక ఆర్బీకేలో ధాన్యం కొనుగోలుపై సోమవారం మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం జరిగింది. మండలంలో 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉండగా ఇప్పటికి కేవలం 652 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే సేకరించారని, ఇటువంటి పరిస్థితుల్లో రైతులు తీవ్రగా నష్టపోయే ప్రమాదముందని ఎంపీటీసీ సభ్యుడు పుట్రేవు సూర్యారావు అధికారులను ప్రశ్నించారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో అరుణకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గంగాదేవితల్లి ఉత్సవం

కశింకోట : మండలంలోని జి.భీమవరంలో ఉన్న గంగాదేవితల్లి ఉత్సవం మంగళవారం పెద్దఎత్తున జరగనుంది. ఉత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఏటా జరిగే ఉత్సవానికి జి.భీమవరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

సీతారామరాజు సతీమణికి నివాళులు



సీతారామరాజు సతీమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



సీతారామరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెంగల

కోటవురట్ల : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్ సీతారామరాజు సతీమణి వరలక్ష్మి సంస్మరణ కార్యక్రమానికి సోమవారం పలువురు నాయకులు, అధికారులు హాజరయ్యారు. తంగేడులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు వేర్వేరుగా పాల్గొని ఆమెకు నివాళి అర్పించారు. సీతారామరాజును పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, రాంబాబురాజు తదితరులు హాజరయ్యారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): మాదక ద్రవ్యాల వాడకంపై నిషేధం ఉందని, అది ఆరోగ్యానికి ప్రమాదకరమే కాకుండా వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యలమంచిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె. జనార్దనరావు అన్నారు. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, వినియోగం వల్ల కలిగే అనర్థాలు, దీనికి సంబంధించిన నిషేధం, చట్టపరమైన కేసుల గురించి వివరించారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచి మంచి విద్యాభ్యాసం చేయాలని, తద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. చెడు మార్గాల్లో పయనించడం, వారిని ప్రోత్సాహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



తైక్వాండోలో జిల్లా స్థాయిలో 30 మెడల్స్ సాధించిన అడ్డురోడ్డు క్లబ్ విద్యార్థులు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు తైక్వాండో క్లబ్ విద్యార్థులకు జిల్లా స్థాయిలో పతకాల పంట పండింది. యలమంచిలి మున్సిపల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి 30 పతకాలు కైవసం చేసుకున్నారు. అడ్డురోడ్డు క్లబ్ నుంచి 34 మంది పోటీల్లో పాల్గొనగా 30 మెడల్స్ సాధించినట్టు కోచ్ చందు తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, కేడెట్, సీనియర్ విభాగాల్లో ఈ పతకాలు వచ్చాయన్నారు. ఇందుల్లో 12 బంగారం, 8 సిల్వర్, 10 బ్రాంజ్ మెడల్స్ ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పి.అచ్యుత్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులకు నిత్యం శిక్షణ ఇస్తూ పతకాలు సాధించేందుకు కృషి చేస్తున్న కోచ్ చందును విద్యార్థుల తల్లిదండ్రులు, సీనియర్ కోచ్‌లు అభినందించారు.



కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి



నునపర్తి సచివాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి



ఎస్.నర్సాపురంలో మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): కుష్టువ్యాధి పట్ల అవగాహన కలిగి సమూలంగా నివారించడానికి కృషి చేయాలని వైద్యులు తరణి, వాసు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని నునపర్తి గ్రామంలో సోమవారం కుష్టువ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు వంద మందికి వైద్య పరీక్షలు చేశారు. 14 రకాల వైద్య పరీక్షలు చేసి, 67 రకాల మందులు పంపిణీ చేశారు.

గ్రామ సర్పంచ్ చుక్కా అనురాధ, మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, వీఆర్‌వో అనంతరావు, సీహెచ్‌వో వేణుగోపాల్‌రావు, హెచ్‌వీ రాజేశ్వరి, సీహెచ్‌వో జానకి, ఏఎన్‌ఎం భావన, డీఈవో అనంతలక్ష్మి, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

చర్మంపై మచ్చలు ఉంటే అశ్రద్ధ చేయవద్దు

మునగపాక : కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డపు శ్రీరామమూర్తి కోరారు. ఒంపోలు సచివాలయంలో కుష్టువ్యాధి నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టువ్యాధి గ్రస్తులను చిన్నచూపు చూడడం సరికాదన్నారు. చర్మంపై మచ్చలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఏఎన్‌ఎం జ్యోతి పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఎస్.నర్సాపురం గ్రామంలో ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించినట్టు శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి వై.తులసి తెలిపారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ కార్యక్రమం నిర్వహించి కుష్టు వ్యాధి పై అవగాహన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఎవరికైనా స్పర్శలేని రంగు మచ్చలు శరీరంపై వుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, నోడల్ ఆఫీసర్ ప్రసాద్, గ్రామ వలంటీర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.